# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

మే 4, 2018

## భారత విప్లవ నాయకులలో ఒకరు, సిపిఐ (మావోయిస్టు) పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ అరవింద్‌కు అరుణారుణ జోహార్లు!

భారత విప్లవ నాయకులలో ఒకరు, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీలోని పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ అరవింద్ (సుజిత్, నిశాంత్) మార్చి మూడవ వారంలో తీవ్రమైన అనారోగ్యంతో తన 65 సంవత్సరాల వయసులో మృత్యుంజయులయ్యారు.

కామ్రేడ్ అరవింద్ బీహార్ రాష్ట్రం జహానాబాద్ జిల్లాలో ఒక మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. రాష్ట్ర రాజధాని పట్నాలో బి.ఎస్‌సి. (సైన్స్) పూర్తి చేశారు. ఆయన డిగ్రీ చదువుతున్న కాలంలో ప్రజ్వరిల్లిన విద్యార్థి యువజనోద్యంలో చేరి క్రియాశీలంగా పనిచేసారు. అదే క్రమంలో విప్లవోద్యమం వైపు ఆకర్షితులయ్యారు. మరి కొందరు విప్లవకారులతో కలిసి కమ్యూనిస్టు క్రాంతికారీ సంగఠన్ (సికెఎస్)ను ఏర్పారచారు. మునుపటి పియు పార్టీలో విలీనం అయ్యారు. పియు పార్టీ కేంద్రకమిటీ నాయకులలో ఒకరిగా అభివృద్ధి అయ్యారు. తర్వాత మునుపటి పిడబ్ల్యు-పియు పార్టీల విలీనాంతరం మునుపటి ఐక్య పిడబ్ల్యు పార్టీలో సిసి సభ్యులుగా పనిచేసారు. ఆ తర్వాత మునుపటి ఐక్య పిడబ్ల్యు, మునుపటి ఎంసిసిఐల విలీనాంతరం ఏర్పడిన ఐక్య పార్టీ, సిపిఐ (మావోయిస్టు)లో సిసి సభ్యులుగా, సిఎంసి సభ్యులుగా పనిచేశారు. 2013లో జరిగిన సిసి-4వ సమావేశంలో కామ్రేడ్ అరవింద్ జీ పోలిట్ బ్యూరో సభ్యునిగా ఎన్నికై అమరులయ్యే నాటి వరకూ అదే బాధ్యతల్లో కొనసాగారు. చాలా కాలంగా మధుమేహం, బిపి వంటి వ్యాధులకు గురైన ఆయన చివరికి గుండెజబ్బుతో అమరులయ్యారు. కామ్రేడ్ అరవింద్ జీకి సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ వినమ్రంగా జోహార్లు అర్పిస్తూ ఆయన ఆశయ సాధన కోసం చివరి వరకూ పోరాడుతామని శపథం చేస్తోంది. ఆయన కుటుంబానికి, బంధుమిత్రుల దుఃఖంలో పాలుపంచుకుంటూ వారికి మనస్ఫూర్తిగా ప్రగాఢ సంతాపం తెలుపుతోంది.

కామ్రేడ్ అరవింద్ జీ జీవితం 1973-74లో రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి అమరుడయ్యే నాటి వరకూ అత్యంత సంఘర్షశీలమైనదిగా ఉండింది. ఆయన ప్రతి అడుగులో, ప్రతి మలుపులో, అనుక్షణమూ ప్రగతిశీల, విప్లవకర పక్షం నిలిచారు. నాలుగు దశాబ్దాలకు పై బడిన ఆయన విప్లవ జీవితం బీహార్-ఝార్ఖండ్ విప్లవోద్యమంతో, భారతదేశ విప్లవోద్యమంతో విడదీయలేనంతగా పెనవేసుకొని పోయింది. అనేక అనుభవాలను అందించింది. ఆనాటి రాజకీయ పరిస్థితి నుంచి, వర్గ పోరాటం నుంచి, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో లక్షలాది ప్రజల సమీకరణల నుంచి, తాను పనిచేసిన ఒక ప్రాంతంలో, రాష్ట్రంలో, రీజినల్ బ్యూరోలో విప్లవోద్యమం అనుసరించిన వ్యూహం-ఎత్తుగడల నుంచి, రివిజనిజానికి వ్యతిరేకంగా సరైన పంథా కోసం జరిగిన సైద్ధాంతిక పోరాటం నుంచి, సరైన పార్టీ పంథాను వ్యతిరేకిస్తూ ముందుకు వచ్చిన తప్పుడు పంథాకు వ్యతిరేకంగా జరిగిన అనేక సైద్ధాంతిక పోరాటాల నుంచి, చిన్న ప్రాంతం నుంచి విశాల గ్రామీణ ప్రాంతాల్లోకి, వ్యూహాత్మక ప్రాంతాల్లోకి జరిగిన విప్లవోద్యమ విస్తరణ నుంచి ఆయన జీవితాన్ని వేరుచేసి చూడలేం.

**ప్రజాస్వామిక రాజకీయాల నుంచి విప్లవ రాజకీయాల్లోకి :** 1970ల తొలిభాగంలో దేశంలో దోపిడీ పాలకవర్గాల ప్రతినిధి అయిన ఇందిరా ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక ఉద్యమాలు వెల్లువెత్తాయి. ఈ ఉద్యమాలలో లక్షలాది మంది విద్యార్థి యువజనులు మిలిటెంట్‌గా పాల్గొన్నారు. కామ్రేడ్ అరవింద్ జీ ఈ ఉద్యమాలలో చేరి క్రియాశీల కార్యకర్తగా పనిచేసారు. ఆ రోజుల్లో కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో సాగిన నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు ప్రభావం దేశవ్యాప్తంగా తీవ్రంగా ఉండింది. బీహార్‌లో సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఉంటూ చారిత్రాత్మక భోజ్‌పూర్ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన కామ్రేడ్ జోహార్ ప్రభావం కూడా తీవ్రంగా ఉండింది. ఈ రెండింటి ప్రభావంతో కామ్రేడ్ అరవింద్ వంటి వారు చారు మజుందార్ పంథాయే సరైందని విశ్వసిస్తూ విప్లవ రాజకీయాల వైపు వచ్చారు. అయితే వీరు బీహార్‌లో ఆ పంథాలో దొర్లిన తప్పులను సరిదిద్దుకోవాలనే వైఖరిని తీసుకుని 1977-79ల మధ్య కమ్యూనిస్టు క్రాంతికారీ సంగఠన్ (సికెఎస్)ను ఏర్పాటు చేశారు. ఇది కామ్రేడ్ అరవింద్ విప్లవ జీవితంలో తొలిమెట్టు.

**సాయుధ వ్యవసాయ విప్లవోద్యమానికి నాయకునిగా .... :** దేశంలో ఎమర్జెన్సీ అనంతరం దేశవ్యాప్తంగా వందలాది మంది కమ్యూనిస్టు విప్లవకారులు జైళ్ల నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైనవారిలో కొందరు నిజమైన విప్లవకారులను ఐక్యం చేయాలనే ఏకైక ఎజెండాతో కామ్రేడ్ నారాయణ్ సాన్యాల్ తదితరుల నాయకత్వంలో 1978 నవంబర్‌లో సిపిఐ (ఎం-ఎల్) (పార్టీ యూనిటీ)ని స్థాపించారు. కామ్రేడ్ అరవింద్ నాయకత్వంలోని సికెఐఎస్‌లోని ఒక సెక్షన్ సిపిఐ (ఎం-ఎల్) (పార్టీ యూనిటీ)తో సంబంధాలు ఏర్పాటు చేసుకుంది. ఈ రెండు గ్రూపులు 1980లో విలీనం అయి యూనిటీ ఆర్గనైజేషన్ (యు.ఓ.)ను ఏర్పాటు చేశాయి. ఇదే 1982 జనవరిలో పంజాబ్‌లోని కొంతమంది విప్లవకారులను కలుపుకొని సిపిఐ (ఎం-ఎల్) పార్టీ యూనిటీ (పి.యు.)గా సంఘటితమైంది. ఇది కామ్రేడ్ అరవింద్ విప్లవ జీవితంలో రెండవ మెట్టు.

సరైన పంథా కోసం కృషి చేస్తూ, విప్లవ పార్టీలో చేరడంతో కామ్రేడ్ అరవింద్ తాను పుట్టి పెరిగిన మగధ్ ప్రాంతంలోని జహానాబాద్, ఔరంగాబాద్, పట్నా జిల్లాల్లో భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని, సాయుధ వ్యవసాయ విప్లవోద్యమాన్ని ప్రారంభించి అభివృద్ధి చేయడానికి తోడ్పడింది. భూస్వామ్య విధానానికి కోట లాంటి బీహార్ రాష్ట్రంలో క్రూరమైన భూస్వాములకు, భూమి సేన వంటి వారి ప్రైవేటు సైన్యాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది రైతాంగాన్ని సమీకరించి నిర్మించిన ఉద్యమం ఒక వెల్లువలా సాగింది. ఇందులో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ సమితి (ఎంకెఎస్ఎస్), దాని నాయకుడిగా కామ్రేడ్ అరవింద్ జీ ప్రధాన పాత్ర పోషించారు. కామ్రేడ్ అరవింద్ జీ గొప్ప ఆందోళనాకారుడు. ఆయన తన ఉపన్యాసాలతో రైతాంగాన్ని ఉర్రూతలూగించేవారు. వేలాది రైతాంగాన్ని మిలిటెంట్ పోరాటాల్లోకి ప్రేరేపించేవారు. ఆయన నాయకత్వంలో భూస్వాములను గ్రామాల నుంచి పారదోలేవారు. భూస్వాముల ప్రైవేటు సైన్యాలపై దాడులు చేసి వర్గకసితో శిక్షించేవారు. ఇందులో ఆయన సమర్థవంతమైన రైతాంగ నాయకుడిగా రైతాంగ విశ్వాసాన్ని చూరగొన్నారు. మగధ్ రీజియన్‌లో దళితులపై అగ్రకుల భూస్వామ్య సైన్యాలు సాగిస్తున్న హత్యాకాండలకు నిరసనగా దళితులను సమీకరించి భూస్వామ్య ప్రైవేటు సైన్యాలపై విజయవంతంగా ప్రతిఘటన చర్యలు నిర్వహించడం, వారి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో కూడా ఆయన పాత్ర ముఖ్యమైంది. ఆ పోరాటం చుట్టుపక్కల ప్రాంతాలకు, కోయల్-కైమూర్ ప్రాంతంలోని పలామూ మొదలైన 6-7 జిల్లాలకు విస్తరించింది. విప్లవోద్యమం అభివృద్ధి చెందడం, విస్తరించడంతో భూస్వాముల పునాదులు కదిలిపోయాయి. భూస్వామ్య అధికారం కూలిపోసాగింది. ఇది సహించలేని రాష్ట్ర ప్రభుత్వం ఈ పోరాటాలను అణచివేసేందుకు పోలీసు క్యాంపులు పెట్టి పెద్ద దాడిని ప్రారంభించింది. 1986 ఏప్రిల్ 19న అర్వల్‌లో ఎంకెఎస్ఎస్ రాష్ట్ర మహాసభ జరుగుతుండగా రాష్ట్ర పోలీసులు జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని తలపింపజేసే విధంగా కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో 23 మంది రైతాంగం అమరులయ్యారు, 70 మంది గాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 40,000 మంది ప్రజలను, కార్యకర్తలను, నాయకత్వాన్ని అరెస్టు చేసి, చిత్రహింసల పాలుచేసి జైళ్లల్లో కుక్కారు. అదనపు పోలీసు క్యాంపులు నిర్బంధ శిబిరాలుగా మారిపోయాయి. ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా సమరశీల ప్రజా ప్రతిఘటనా ఉద్యమాలు ముందుకు వచ్చాయి.

**భూస్వామ్య వ్యతిరేక పోరాటాల నుంచి విముక్తి ప్రాంతాల లక్ష్యంతో గెరిల్లా జోన్ల నిర్మాణం వైపు పురోగమించడానికి కృషి :** ఉద్యమాన్ని మరో మెట్టు ఎదిగించడంలో కామ్రేడ్ అరవింద్ పాత్ర చాలా కీలకమైంది. వ్యవసాయ విప్లవోద్యమాల్లో ముందుకు వచ్చిన శక్తులను పార్టీ యూనిట్లలో సంఘటితం చేశారు. ఎంకెఎస్ఎస్ నుంచి, ప్రజా మిలీషియా నుంచి గెరిల్లా దళాలను నిర్మించారు. భూస్వామ్య అధికారాన్ని ధ్వంసం చేసి, పార్టీ నాయకత్వంలో నాలుగు వర్గాల ఐక్యసంఘటనతో ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించే లక్ష్యంతో ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికి నిర్దిష్టమైన పథకాలను తయారు చేయాలని పార్టీలో చర్చించారు. ఇందుకు కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలు చేసారు. ఈ విధంగా మునుపటి పియు పార్టీ లైన్‌ను అభివృద్ధి చేయడానికి కామ్రేడ్ అరవింద్ తీవ్రంగా కృషి చేసారు.

**కామ్రేడ్ అరవింద్ పార్టీ అంతర్గత పోరాటాలలో పార్టీ మౌలిక రాజకీయ పంథాకు అంటిపెట్టుకొని ఉన్నారు :** పార్టీ అంతర్గత పోరాటాల్లో కామ్రేడ్ అరవింద్ పార్టీ పంథాకు దృఢంగా అంటిపెట్టుకొని ఉన్నారు. ముఖ్యంగా పియు పార్టీ సిసి కార్యదర్శిగా ఉండిన అశోక్ 1987లో జరిగిన పార్టీ మొదటి కాన్ఫరెన్స్‌లో మితవాద పంథాను చేపట్టాలని ప్రతిపాదించారు. మన దేశం అర్ధ భూస్వామ్య సమాజం కాదనీ, పెట్టుబడిదారీ సమాజంగా మారిందనీ, అందువల్ల దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా మార్గాన్ని విడిచిపెట్టాలనే డాక్యుమెంటును ముందుకు తెచ్చినప్పుడు ఈ తప్పుడు పంథాను కామ్రేడ్ నారాయణ్ సాన్యాల్ నాయకత్వంలో మెజారిటీ పార్టీ తిరస్కరించి, పార్టీ పంథాను, పార్టీని పరిరక్షించి ఉద్యమాన్ని పురోగమింపజేసింది. ఇందులో కామ్రేడ్ నారాయణ్ సాన్యాల్‌తో పాటు ముందున్నవారిలో ఒకరు కామ్రేడ్ అరవింద్.

**రివిజనిస్టు పార్టీల అవకాశవాద రాజకీయాలపై పోరాటం :** కామ్రేడ్ జోహార్ అమరత్వం తర్వాత సిపిఐ (ఎం-ఎల్) లిబరేషన్ గ్రూపు నాయకత్వంలోకి వినోద్ మిశ్రా వచ్చాడు. ఆయన రివిజనిస్టు పంథా చేపట్టాడు. ఆనాడు బీహార్‌లో బలమైన గ్రూపుగా ఉన్న ఈ పార్టీకి వ్యతిరేకంగా ఇంకా ఎం-ఎల్ క్యాంపులోని ఇటువంటి పలు రివిజనిస్టు గ్రూపులకు వ్యతిరేకంగా పియు పార్టీ నిర్వహించిన సైద్ధాంతిక పోరాటంలో కూడా కామ్రేడ్ అరవింద్ పాత్ర ముఖ్యమైనది.

**విప్లవకారుల ఐక్యతకు ప్రాతిపదికను తయారు చేశారు :** ఈ విధంగా సరైన రాజకీయ పంథాను అనుసరిస్తూ బలమైన విప్లవోద్యమాలను నిర్మించకుండా నిజమైన విప్లవకారుల మధ్య ఈ ఐక్యత సాధ్యం కాదనే సరైన అవగాహనతో కామ్రేడ్ అరవింద్ మగధ్‌లో బలమైన ఉద్యమాలను నిర్మించారు. విప్లవ పంథాను సుదృఢం చేసారు. ఈ విధంగా విప్లవకారుల ఐక్యతను సాధించడంలో భారత విప్లవోద్యమానికి కామ్రేడ్ అరవింద్ గొప్ప విప్లవానుభవాన్ని అందించారు. ఇది మునుపటి పియు పార్టీలో ఒక మలుపును తీసుకొచ్చింది. ఇది పిడబ్ల్యు, పియు పార్టీల విలీనానికి ప్రాతిపదికను ఏర్పరచింది. తద్వారా నక్సల్బరీ ప్రేరణ నుంచి ఆవిర్భవించిన

సిపిఐ (ఎం-ఎల్) స్రవంతిలో రెండు ముఖ్యమైన పార్టీలు – పిడబ్ల్యు, పియు విలీనంలో ఆయన ముఖ్యమైన పాత్రను నిర్వహించారు.

పిడబ్ల్యు, పియు పార్టీలు ఐక్య పిడబ్ల్యుగా ఏర్పడిన తర్వాత ఎంసిసిఐతో దాదాపు మూడు సంవత్సరాల పాటు జరిగిన భౌతిక ఘర్షణలు భారతదేశ విప్లవోద్యమ చరిత్రలో ఒక చీకటి అధ్యాయం చెరిగిపోని మచ్చగా నిలిచిపోయించి, తీవ్రమైన నష్టాన్ని కలిగించాయి. అయితే సరైన సిద్ధాంతం, ఆచరణ ప్రాతిపదికనే, లోతైన ఆత్మవిమర్శ ప్రాతపదికనే ఎటువంటి అవకాశవాద రాజీలకూ తావులేకుండా నిజమైన విప్లవకారులు పరస్పరం ఒకరి నుంచి మరొకరు నేర్చుకోవడం ద్వారానే నిజమైన ఐక్యతను సాధించగలరని విశ్వసించి అందుకోసం దృఢంగా కృషి చేసిన వారిలో ఒకరు కామ్రేడ్ అరవింద్. ఇది భారత విప్లవోద్యమంలో రెండు ప్రధాన స్రవంతులుగా ఉన్న ఎంసిసిఐ, పిడబ్ల్యుల ఐక్యతకు, సిపిఐ (మావోయిస్టు) నిర్మాణానికి మార్గం సుగమం చేసింది.

**పార్టీలో ఉన్నతస్థాయి ఉత్తమ కమాండర్లలో ఒకరు కామ్రేడ్ అరవింద్ :** భారత విప్లవం దేశ పీడిత ప్రజలకు అందించిన ఉన్నత స్థాయి ఉత్తమ కమాండర్లలో కామ్రేడ్ అరవింద్ ఒకరు. బీహార్‌లో గెరిల్లాయుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన ఒక ముఖ్యమైన పాత్రను పోషించారు. సాయుధ పోరాటాన్ని ప్రధాన పోరాటం రూపంగా, ప్రజా గెరిల్లా యూనిట్లుగా గెరిల్లా దళాలను, ప్లాటూన్లను, కంపెనీలను ప్రధాన నిర్మాణ రూపంగా అభివృద్ధి చేయడంపై ఆయన కేంద్రీకరించి కృషి చేశారు. సిపిఐ (మావోయిస్టు) ఆవిర్భావం తర్వాత సెంట్రల్ మిలటరీ కమీషన్ (సిఎంసి) సభ్యుడిగా, తూర్పు రీజినల్ కమాండ్ (ఈఆర్‌సి) సభ్యుడిగా ఆయన తన బాధ్యతలు చురుగ్గా నిర్వహించారు. విప్లవోద్యమాన్ని నిర్మూలించడం కోసం శత్రువు చేపట్టిన అనేక దాడి క్యాంపెయిన్లను విఫలం చేయడంలో, అటవీ, పర్వత, మైదాన ప్రాంతాలలో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడంలో, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో తగిన ఎత్తుగడలను రూపొందించి అమలు చేయడంలో బీహార్–ఝార్ఖండ్‌లలో ఆయన నిర్వహించిన పాత్ర చాలా కీలకమైంది. అనేక వీరోచిత, సాహసిక గెరిల్లా చర్యలలో – ఆంబుష్‌లలో, రెయిడ్లలో, ఎన్‌కౌంటర్లలో ప్రత్యక్షంగా నేతృత్వం వహించడమే కాక, అనేక చర్యలకు సరైన గైడెన్స్ అందించి వాటిని విజయవంతం చేయడంలో ముఖ్య పాత్ర నిర్వహించారు. గెరిల్లా చర్యలు నిర్వహించడంలో ఎటువంటి ఆటంకాలు ఎదురైనా వాటన్నింటినీ నిబ్బరంగా అధిగమిస్తూ అపారమైన చొరవ, దృఢసంకల్పం, ధైర్యసాహసాలు, త్యాగనిరతి, సమయస్ఫూర్తితో వాటిని విజయవంతం చేసేవారు. శత్రు బలగాలకూ మన పిఎల్‌జిఏ బలగాలకూ మధ్య జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో ఆయన పిఎల్‌జిఏ బలగాలకు వీరోచితంగా నేతృత్వం వహిస్తూ సమన్వయించి శత్రుదాడులను తిప్పికొట్టారు. వీలైనంత వరకూ మన బలగాలను కాపాడుకునేలా, శత్రు బలగాలను దెబ్బతీసేలా ప్రత్యక్ష కమాండింగ్ నిర్వహించారు. గెరిల్లా యుద్ధాన్ని ఉన్నతస్థాయికి అభివృద్ధి చేస్తూ నిర్దిష్ట గెరిల్లా యుద్ధ చర్యల ద్వారా చలన యుద్ధానికి సంబంధించిన లక్షణాలను అభివృద్ధి చేయడం కోసం ఆయన తీవ్రంగా కృషి చేశారు. జహానాబాద్ జైల్ బ్రేక్, భండరియా, ధర్‌ధరియా, అముహాటికర్ వంటి పలు గెరిల్లా చర్యలు ఇందుకు నమూనాలుగా నిలుస్తాయి. ఈఆర్‌సి పరిధిలో బీహార్ రీజియన్‌లో కోయల్–కైమూర్ ప్రాంతంలో ఏర్పడిన మొదటి కంపెనీకి ఆయన ప్రత్యక్ష నేతృత్వం వహించారు. నిర్విరామ కృషి సాగించడం ద్వారా గెరిల్లా యుద్ధంలో అనేక నూతన అనుభవాలను అందించారు. రాజకీయ–సైనిక క్యాంపుల నిర్వహణలో క్రియాశీల ఆత్మరక్షణా పద్ధతులను అభివృద్ధి చేసి ఒక నమూనాను పార్టీ, పిఎల్‌జిఏ ముందుంచారు. కేవలం మిలటరీ పథకాలను రూపొందించడమే కాక వాటిని నిర్దిష్టంగా అమలు చేయడంలో ఆయన ప్రత్యక్ష నేతృత్వం వహించేవారు. ఆయన నిరంతరం ఫీల్డ్‌లో పిఎల్‌జిఏ కంపెనీలో ఉంటూ పార్టీకీ, పిఎల్‌జిఏకూ ప్రత్యక్ష నేతృత్వం వహిస్తూండిన ఫలితంగా శత్రువుకు ప్రధాన టార్గెట్లలో ఒకరుగా మారారు. వందలాది–వేలాది శత్రు బలగాలు ఆయనను అంతమొందించడం కోసం నిరంతరం వేట సాగిస్తుండేవి. అయినప్పటికీ శత్రు దాడులను ఆయన ఏమాత్రం లక్ష్యపెట్టేవారు కాదు. శత్రువుకు ఎన్నడూ వెన్ను చూపలేదు. ఆయనను మట్టుబెట్టడానికి ప్రత్యేకంగా శత్రువు కౌంటర్ గెరిల్లా ఆపరేషన్లు చేపట్టిన చాలా సందర్భాలలో వాటిని ఎదురుదెబ్బతీయడం కోసం ఆయన నేతృత్వంలో పిఎల్‌జిఏ బలగాలు అనేక సాహసిక ఎదురుదాడులు నిర్వహించాయి. వీటిలో శత్రు బలగాలను పెద్ద సంఖ్యలో నిర్మూలించాయి. ఈ విధంగా సిపిఐ (మావోయిస్టు) ఆవిర్భావం ముందూ, తర్వాతా గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో కామ్రేడ్ అరవింద్ విశేషమైన పాత్ర నిర్వహించారు.

**ఎక్స్‌ప్లోజివ్స్, మైన్ యుద్ధతంత్ర నిపుణుడిగా ఎదిగి నూతన అనుభవాలు అందించారు :** గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడం కోసం సప్లై కొరతలు తీవ్రంగా ఉన్న స్థితిలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్స్ (పేలుడు పదార్థాలను) తయారు చేయడంలో, పలు రకాల మైన్లను అభివృద్ధి చేయడంలో, మైన్ యుద్ధతంత్రాన్ని పెంపొందించడంలో కామ్రేడ్ అరవింద్ నిర్వహించిన పాత్ర విశేషమైంది. పేలుడు పదార్థాల గురించి లోతుగా అధ్యయనం చేసి వాటిపై పట్టు సంపాదించడమే కాక, వాటి తయారీ–వినియోగంలో అనేక ప్రమాదకరమైన ప్రయోగాలను ప్రత్యక్షంగా, విజయవంతంగా నిర్వహించారు. పిఎల్‌జిఏ బలగాలకు పేలుడు పదార్థాల తయారీ–వినియోగంపై తూర్పు రీజియన్‌లో అనేక ట్రైనింగ్ క్యాంపులు, మధ్యరీజియన్‌లో కూడా ఒక ట్రైనింగ్ క్యాంపు నిర్వహించారు. నోట్సు తయారు చేసి అందించారు. ఆయన అభివృద్ధి చేసిన నూతన విజ్ఞానం, టెక్నిక్‌లను వినియోగించి ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్స్‌ను, డివైజులను శత్రు బలగాలపై సమర్థవంతంగా ప్రయోగించి వాటికి తీవ్రమైన నష్టాలను కలిగించడంలో కామ్రేడ్ అరవింద్ పాత్ర ప్రధానమైంది.

**గెరిల్లా బలగాల సప్లై ఇన్‌చార్జిగా :** సిపిఐ (మావోయిస్టు) సిఎంసిలో సప్లై ఇన్‌చార్జులలో ఒకరిగా బాధ్యతలు నిర్వహించారు. శత్రువు కేంద్రీకరించి పార్టీ సప్లై యంత్రాంగాన్ని దెబ్బతీసిన తర్వాత, కఠిన పరిస్థితిలో సైతం గెరిల్లా బలగాలకు ప్రత్యేకించి మధ్య రీజియన్‌కు సప్లైలు అందించడానికి ఆయన చాలా తీవ్రంగా ప్రయత్నం చేసారు. ఇందుకోసం తన బంధుమిత్రులను సైతం వినియోగించారు. శత్రువు మన పార్టీ సప్లై యంత్రాంగంపై వరుసగా దాడులు చేస్తూ నష్టపరుస్తున్నప్పటికీ తిరిగి తిరిగి ఆ యంత్రాంగాన్ని పునరుద్ధరింపజేయడం కోసం నిర్విరామంగా ఆయన కృషి చేశారు. యుద్ధంలో ఓటమిని చూసి బెదిరిపోకుండా ఓటమి తాత్కాలికమని, అంతిమ విజయం ప్రజలదేనని విశ్వసించి విజయ సాధనకై నిరంతరం కృషి సల్పిన ఉన్నత స్థాయి విప్లవ సేనాని, ధీరోదాత్త నాయకుడు ఆయన.

**శత్రు నిర్బంధంలో చెక్కుచెదరని యోధుడు :** కామ్రేడ్ అరవింద్ రెండు సార్లు అరెస్టయినారు. నిరంతరం శత్రు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. అరెస్టయినప్పుడు తీవ్రమైన మానసిక హింసలను సైతం ఎదుర్కొని అత్యంత ధైర్యంగా పార్టీ రహస్యాలను కాపాడారు. జైలు నుంచి విడుదలైన వెంటనే అజ్ఞాతవాసంలోకి వచ్చి పార్టీ శ్రేణుల వద్దకు చేరుకొని పార్టీకి నేతృత్వం వహించారు.

**కామ్రేడ్ అరవింద్ జీవితం పార్టీకీ, భారత పీడిత వర్గాల యువతీ, యువకులకు ఆదర్శం:** మొత్తంగా చూస్తే, కామ్రేడ్ అరవింద్ జీవితం దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో ఎన్ని ఎగుడు-దిగుళ్లు, ఆటు-పోట్లు, మెలికలు-మలుపులు ఎదురైనా, ఎంతమంది తన సహచర కామ్రేడ్స్ తన కళ్లముందే అమరులైనా ఎన్నడూ నిరాశ అనేది దరిచేరినీయకుండా నిర్విరామంగా కృషి చేస్తూ ప్రజలపై, పార్టీపై, ప్రపంచ కార్మికవర్గంపై విశ్వాసముంచి పోరాడిన చరిత్రతో కూడినది. భారతదేశంలో ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో ప్రత్యేకించి పార్టీ పంథాను నిర్దిష్టంగా అన్వయించడంలో ఆయన సేవలు అపారమైనవి. తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనా చివరి వరకూ అజ్ఞాతంలో వ్యూహాత్మక ప్రాంతంలోనే ఉంటూ పార్టీ శ్రేణులకు ప్రత్యక్ష నేతృత్వం అందించారు. వారి మధ్యనే ఆయన అమరులయ్యారు. ఆయన నిస్వార్థంగా విప్లవం కోసం కృషి చేసిన కార్మికవర్గ యోధుడు, కమాండర్, నాయకుడు. ప్రజలతో, పార్టీ కేడర్లతో మమేకమై, వారి విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడు. పార్టీకి రాజకీయంగా ఎంత దృఢంగా నాయకత్వాన్ని అందించేవారో, అలాగే నిరంతరం హాస్యోక్తులతో ప్రజలను, కేడర్లను రంజింపజేసేవారు. సహచర కామ్రేడ్స్‌కు తన అపార విప్లవ జీవిత అనుభవాలను అందిస్తూ వారిని ఉత్తేజపరిచేవారు. ప్రత్యేక విషయాలపై అలుపెరగుండా అధ్యయనం కొనసాగించేవారు. సాదాసీదా కమ్యూనిస్టు జీవితం గడిపారు. ఆయన ఆవిష్కరించిన ఆదర్శాలు పార్టీలో పై నుంచి, కింది వరకూ క్యాడర్లకు, పిఎల్‌జిఏ కమాండర్లకు, యోధులకు, నూతన తరం క్యాడర్లకు, వివిధ పీడిత వర్గాల ప్రజలకు ఆదర్శనీయం. ఆయన అమరత్వంతో భారత విప్లవం ఒక మహా నాయకుడిని కోల్పోయింది. అయితే భారత విప్లవోద్యమంలో, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంలో, పీడిత ప్రజల హృదయాల్లో ఆయన సదా జీవించే ఉంటారు. వీరందరికీ సదా ప్రేరణనిస్తూనే ఉంటారు.

రండి! భారత విప్లవ నాయకులలో ఒకరుగా విప్లవోద్యమానికి ఎనలేని సేవలు చేసిన కామ్రేడ్ అరవింద్ ఆదర్శాలను ఎత్తిపడదాం! విప్లవోద్యమం ఎదుర్కొంటున్న కఠిన పరిస్థితిని అధిగమించడానికి ఆయన చూపిన మార్గంలో పురోగమించి విప్లవోద్యమాన్ని మరింత ఉన్నత స్థాయికి అభివృద్ధి చేద్దాం! ఆయన కలలు గన్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేస్తూ సోషలిజం-కమ్యూనిజం స్థాపించేంత వరకూ అవిశ్రాంతంగా పోరాడుతామని శపథం చేద్దాం!

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**